

కారును తనిఖీ చేస్తున్న ఇన్‌స్పెక్టర్ రాజునాయక్, పోలీసులు

చిక్కడపల్లిలో పోలీసుల తనిఖీలు

చిక్కడపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ ఎర్రకోట వద్ద జరిగిన బాంబు పేలుళ్ల నేపథ్యంలో చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీసులు సోమవారం రాత్రి నుంచి విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆర్టీసీక్రాస్ రోడ్, చిక్కడపల్లి మెట్రోస్టేషన్‌లవద్ద వాహనాల తనిఖీతోపాటు అనుమానాస్పదంగా కనిపించినవారిని ప్రశ్నించారు. బస్సులు, ఆటోలు, ద్విచక్రవాహనాలపై వెళ్లేవారిని సైతం పరిశీలించారు. మంగళవారం సినిమా థియేటర్లు, లాడ్జిలు, హోటళ్లు, ప్రధాన కూడళ్ళు చిక్కడపల్లి, బాగ్‌లింగంపల్లి, అశోక్‌నగర్ తదితర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించినట్లు ఇన్‌స్పెక్టర్ రాజునాయక్ తెలిపారు.

ప్రజలు అడిగినన్ని రెవెన్యూ స్టాంపులు ఇవ్వండి

● పోస్టాఫీసులకు ఉత్తర్వులు జారీ చేసిన అసిస్టెంట్ డైరెక్టర్

రాంనగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎన్ని అడిగితే అన్ని రెవెన్యూ స్టాంపులు ఇవ్వాలని హైదరాబాద్ రీజియన్ పరిధిలోని పోస్టాఫీసులకు అసిస్టెంట్ డైరెక్టర్ ఈ నెల 10న సర్క్యులర్ జారీ చేశారు. నగరంలో పోస్టాఫీసుల్లో రెవెన్యూ స్టాంపుల కొరత ఉందని 'ఆంధ్రజ్యోతి'లో గత నెల 25వ తేదీన ప్రచురితమైన కథనానికి అసిస్టెంట్ డైరెక్టర్ స్పందించారు. స్టాంపుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. రెవెన్యూ స్టాంపులను బ్లాక్‌లో అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



లింగయ్యయాదవ్‌కు నియామకపత్రం అందజేస్తున్న ఆర్.కృష్ణయ్య

బీసీ విద్యార్థి జేఏసీ రాష్ట్ర చైర్మన్‌గా
వీరబోయిన లింగయ్యయాదవ్ నియామకం

రాంనగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): బీసీ విద్యార్థి జేఏసీ తెలంగాణ రాష్ట్ర చైర్మన్‌గా వీరబోయిన లింగయ్యయాదవ్ నియమితులయ్యారు. మంగళవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో జరిగిన బీసీ విద్యార్థి సమావేశంలో ఎంపీ ఆర్. కృష్ణయ్య ఆయనకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లింగయ్యయాదవ్ మాట్లాడుతూ తనకు పదవి ఇచ్చినందుకు కృష్ణయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సి.రాజేందర్, నీల వెంకటేష్, అనంతయ్య, రాందేవ్‌మోదీ, నిఖిల్‌పటేల్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులూ.. ఒత్తిడికి గురికావద్దు



మాట్లాడుతున్న డాక్టర్ అరుణారెడ్డి

రాంనగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఒత్తిడికి గురికావద్దని ప్రముఖ సైకియాట్రిస్ట్ డాక్టర్ అరుణారెడ్డి సూచించారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని అంబేడ్కర్ కళాశాల ఆవరణలో ఒత్తిడి, డిప్రెషన్ తదితర అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అరుణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు మానసిక సమతుల్యత, ఆరోగ్యం మధ్య ఉన్న అనుబంధాన్ని తెలుసుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు ఆమె సమాధానం ఇచ్చారు. కార్యక్రమంలో అంబేడ్కర్ విద్యా సంస్థల కరస్పాండెంట్ డాక్టర్ సరోజ వివేక్, సీఈవో ప్రొఫెసర్ లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

చిక్కడపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగర గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 14 నుంచి 20 వరకు చిక్కడపల్లిలోని నగర కేంద్ర గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నామని గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేసిరెడ్డి ఉపేందర్‌రెడ్డి, కార్యదర్శి పొట్లూరు పద్మజ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పుస్తక ఎగ్జిబిషన్, వ్యాసరచన, వక్తృత్వపోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

నేడు అయ్యప్ప భక్తులకు అన్నదానం

చిక్కడపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వివేక్‌నగర్‌లోని అష్టలక్ష్మి దేవాలయం వద్ద బుధవారం అయ్యప్ప భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆలయ నిర్వాహకులు, అయ్యప్ప గురుస్వామి కాజా పూర్ణచందర్ తెలిపారు. మధ్యాహ్నం ఒంటిగంటకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

ప్రొఫెసర్ ఎన్.లక్ష్మణ్‌రావుకు జీవిత సాఫల్య పురస్కారం



గ్రంథాలయ సమాచార శాఖ విభాగంలో దేశవ్యాప్తంగా విస్తృత సేవలందిస్తున్న ఉస్మానియా యూనివర్సిటీ ఎమిరైటస్ ప్రొఫెసర్, తెలంగాణ గ్రంథాలయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.లక్ష్మణ్‌రావు జీవిత సాఫల్య పురస్కారం అందుకున్నారు. ఇటీవల మిజోరాం రాష్ట్ర రాజధాని ఐజ్వాల్‌లో జరిగిన గ్రంథాలయ శాఖ జాతీయ సెమినార్‌లో ఆయనకు పురస్కారాన్ని ప్రదానం చేశారు.

- అంబర్‌పేట, ఆంధ్రజ్యోతి

'జూబ్లీహిల్స్‌లో దొంగ ఓట్లు వేసేందుకు కాంగ్రెస్ నేతల యత్నం'

ముషీరాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఎలాగైనా విజయం సాధించాలని కాంగ్రెస్ నేతలు దొంగ ఓట్లు వేసేందుకు ప్రయత్నించారని బీఆర్ఎస్ నాయకుడు ముఠా జైసింహ ఆరోపించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు దీన్‌దయాల్‌రెడ్డి, శివముదిరాజ్, బింగి నవీన్, అబేద్ పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు భవనంపై నుంచి పడి వ్యక్తి మృతి



శ్రీనివాస్ (ఫైల్)

కవాడిగూడ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు భవనం పై నుంచి పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ హరీష్ తెలిపిన వివరాల ప్రకారం.. బన్సీలాల్‌పేట్ డివిజన్ పొట్టి శ్రీరాములు నగర్ డబుల్ బెడ్‌రూమ్‌లో ఉంటున్న శ్రీనివాస్(45) డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయం 8వ అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు మంగళవారం కిందపడ్డాడు. తలకు తీవ్రమైన గాయం కావడం, ఎముకలు విరగడంతో అక్కడికక్కడే చనిపోయాడు. గాంధీనగర్ పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టీవీఎస్ ఎక్స్‌ఎల్‌లే లక్ష్యం

● చోరీలు చేస్తున్న ముగ్గురి అరెస్ట్

● 19 ద్విచక్ర వాహనాలు స్వాధీనం



పోలీసులు అరెస్ట్ చేసిన నిందితులు (ముసుగు ధరించిన వారు), స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలు

అంబర్‌పేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాలు చోరీ చేస్తున్న ముగ్గురిని అంబర్‌పేట పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి సుమారు రూ. 15 లక్షల విలువైన 19 టీవీఎస్ ఎక్స్‌ఎల్ వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఈస్ట్‌జోన్ డీసీపీ డాక్టర్ బి. బాలస్వామి వివరాలు వెల్లడించారు.

లాల్‌దర్వాజ ఛత్రినాకకు చెందిన షకత్‌వారి శ్రవణ్ (28) పాత దొంగ. అల్లం, వెల్లుల్లిగడ్డల వ్యాపారం చేస్తున్నాడు. తన స్నేహితులైన బీబీనగర్‌కు చెందిన కాలియారాజు, మేడ్చల్‌కు చెందిన షకత్ ముఖేంద్రతో కలిసి సులభంగా డబ్బుల సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. టీవీఎస్ ఎక్స్‌ఎల్ వాహనాలు చోరీ చేస్తే యజమానులు కూడా చిన్న వాహనం అని ఫిర్యాదు చేసే అవకాశం ఉండదని భావించి ఆ వాహనాలను చోరీచేస్తున్నారు. ప్రధాన నిందితుడు షకత్‌వారి శ్రవణ్ గతంలో అఫ్జల్‌గంజ్, బాలానగర్ పీఎస్ పరిధిలో దొంగతనం చేసి జైలుకు వెళ్లాడు. జైలు నుంచి వచ్చిన తర్వాత మొదటి భార్యకు విడాకులు ఇచ్చి శాంతి అనే మహిళను రెండో వివాహం చేసుకున్నాడు. ఉప్పల్ బీరప్పగడ్డలో నివసిస్తూ కూరగాయల వ్యాపారం చేస్తున్నాడు. స్నేహితులతో కలిసి అంబర్‌పేట ప్రేమ్‌నగర్‌లో ఈనెల 7వ తేదీన జి. రాజశేఖర్ ఇంటి ఎదుట పార్క్ చేసిన టీవీఎస్ ఎక్స్‌ఎల్ వాహనాన్ని చోరీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా కేసు దర్యాప్తు ప్రారంభించారు. ఈ నెల 11వ తేదీన అలీకేఫ్ చౌరస్తాలో వాహనాలను తనిఖీ చేస్తున్నారు. శ్రవణ్, రాజు, ముఖేంద్ర అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకున్నారు. విచారించగా నేరాన్ని అంగీకరించారు. వీరు అంబర్‌పేట, కాచిగూడ, ఛత్రినాకలో ఒక్కొక్కటి, ఉప్పల్‌లో 9, నేరేడ్‌మెట్‌లో 2, శామీర్‌పేటలో 2, కుషాయిగూడలో 2, అల్వాల్ పీఎస్‌లో ఒక వాహనాన్ని చోరీ చేశారు. దొంగిలించిన వాహనాలను గ్రామాల్లో తక్కువ ధరకు విక్రయించేవారు. పోలీసులు వారి నుంచి 19 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకొని నిందితులను రిమాండ్‌కు తరలించారు. విలేకరుల సమావేశంలో ఈస్ట్‌జోన్ అడిషనల్ డీసీపీ జోగుల నర్సయ్య, కాచిగూడ ఏసీపీ వై.హరీష్‌కుమార్, అంబర్‌పేట సీఐ కిరణ్‌కుమార్, డీఐ హఫీజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రేపు రాష్ట్ర వ్యాప్తంగా బీసీల ధర్మపోరాట దీక్షలు

బీసీల రిజర్వేషన్ల సాధనకు కేంద్రంపై సీఎం ఒత్తిడి తీసుకురావాలి : జాజుల శ్రీనివాస్‌గౌడ్



దీక్ష పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్, గుజ్జ కృష్ణ తదితరులు

బర్కత్‌పుర, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి అఖిలపక్ష బృందాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం కాచిగూడ అభినందన్ గ్రాండ్ హోటల్‌లో బీసీ జేఏసీ కో-ఆర్డినేటర్ గుజ్జ కృష్ణ ఆధ్వర్యంలో ఈ నెల 13న నిర్వహిస్తున్న బీసీల ధర్మపోరాట దీక్ష వాల్‌పోస్టర్‌ను శ్రీనివాస్‌గౌడ్ ఆవిష్కరించారు.

ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా రాష్ట్రవ్యాప్తంగా జిల్లా, అసెంబ్లీ నియోజకవర్గాలు, మండల కేంద్రాలలో ధర్మపోరాట దీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. అదేరోజు ఇందిరాపార్కు వద్ద వేలాది మందితో దీక్ష జరుగుతుందన్నారు. 16న రన్ ఫర్ సోషల్ జస్టిస్, 18న ఎంపీలతో మిలాఖత్, 23న అఖిల పక్ష సమావేశం, డిసెంబరు మొదటి వారంలో చలో ఢిల్లీ కార్యక్రమం, మూడవ వారంలో తెలంగాణ బస్సు యాత్ర నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. డిసెంబరు నెలాఖరున లక్షలాది మందితో పరేడ్‌గ్రౌండ్‌లో 'వేల వృత్తులు, కోట్ల గొంతులు' అనే నినాదంతో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాయకులు నందగోపాల్, ఉదయ్‌నేత, కె.గణేష్‌చారి, వీరస్వామి, కె.జగన్నాథం, జి.నర్సింహ, మణిమంజరి తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లకు రాజ్యాంగ సవరణ చేయాలి

రాంనగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జనాభా ప్రకారం రిజర్వేషన్లకు రాజ్యాంగ సవరణ చేయాలని డిసెంబరు 10న ఢిల్లీలో ఓబీసీ సదస్సు నిర్వహిస్తున్నామని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎత్తారి భీమ్‌రాజ్ తెలిపారు. ఆర్.కృష్ణయ్య నాయకత్వంలో ఢిల్లీలో జరిగే ఓబీసీ సదస్సుకు రాజకీయ పార్టీలన్నీ హాజరు కావాలని కోరారు. డిమాండ్ల సాధన కోసం ఈనెల 26న అన్ని జిల్లా కేంద్రాల్లో సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు.



అభివాదం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, రైతు సంఘం నాయకులు సుదర్శన్, సాగర్ తదితరులు

సామినేని రామారావు స్ఫూర్తితో
రైతాంగ సమస్యలపై ఐక్యపోరాటం చేయాలి

● మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

రాంనగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సామినేని రామారావు స్ఫూర్తితో రైతాంగ సమస్యలపై ఐక్యపోరాటం చేయాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పి.సుదర్శన్, టి.సాగర్ పిలుపునిచ్చారు. మంగళవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో రైతు సంఘం మాజీ అధ్యక్షుడు సామినేని రామారావు సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతాంగ సమస్యలపై గ్రామ స్థాయి నుంచి రాష్ట్రం వరకు ఆయన నిస్వార్థంగా పనిచేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, బి.చంద్రారెడ్డి, నంద్యాల నర్సింహారెడ్డి, కందాల ప్రమీల, జంగారెడ్డి, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

దేశిని చినమల్లయ్య, అందెశ్రీ సేవలు మరువలేనివి



దేశిని చినమల్లయ్య, అందెశ్రీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బి.బాల్‌రాజ్‌గౌడ్, అంబాల నారాయణగౌడ్ తదితరులు

రాంనగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రజలకు మాజీ ఎమ్మెల్యే దేశిని చినమల్లయ్య, అందెశ్రీ అందించిన సేవలు మరువలేనివని బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగౌని బాల్‌రాజ్‌గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం చిక్కడపల్లిలోని ఫ్రంట్ కార్యాలయంలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేగా దేశిని చినమల్లయ్య రాష్ట్రానికి అందించిన సేవలు మరవలేనివన్నారు. అందెశ్రీ మృతి తెలంగాణ సాహిత్యానికి తీరని లోటని అన్నారు. కార్యక్రమంలో గౌడ ఐక్య సాధన సమితి అధ్యక్షుడు అంబాల నారాయణగౌడ్, బీసీ పొలిటికల్ ఫ్రంట్ కన్వీనర్ ఆయిలి వెంకన్నగౌడ్, బీసీ సమాఖ్య అధ్యక్షుడు ఎస్.దుర్గయ్యగౌడ్, గౌడ జన హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు యోలికట్టే విజయ్‌కుమార్‌గౌడ్, నాయకులు సింగం నగేష్‌గౌడ్, గడ్డం విజయ్‌కుమార్‌గౌడ్, సత్తయ్యగౌడ్, నరేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

● పరామర్శ



అందెశ్రీ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎంపీ వి. హనుమంతరావు

అందెశ్రీ మృతి తెలంగాణ సమాజానికి తీరనిలోటు

చిక్కడపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అందెశ్రీ మృతి తెలంగాణ సమాజానికి తీరని లోటు అని హైదరాబాద్ నగర కేంద్రగ్రంథాలయం మాజీ చైర్మన్ గడ్డం శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి ప్రాణం పోసిన గీత రచయితగా చిరస్థాయిగా ఆయన ప్రజలకు గుర్తుండిపోతారన్నారు.

హౌకా సంతాపం

గోల్నాక, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర గీత రచయిత, ప్రముఖ కవి డాక్టర్ అందెశ్రీ ఆకస్మిక మృతిపట్ల హైదరాబాద్ ఓల్డ్ సిటీ రైటర్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ (హౌకా) అధ్యక్షుడు డాక్టర్ ఎస్.విజయభాస్కర్ సంతాపం తెలియజేశారు. అందెశ్రీ జీవిత చరిత్రను, ఆయన సాహిత్యాన్ని పాఠ్యాంశంగా బోధించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

స్థిరాభివృద్ధి లక్ష్యాలపై అధ్యాపకుల సమావేశం

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా విశ్వవిద్యాలయంలో వీసీ అధ్యక్షతన యునైటెడ్ నేషన్స్ స్థిరాభివృద్ధి లక్ష్యాల (ఎస్‌డీజీఎస్)సాధనపై అధ్యాపకుల సమావేశాన్ని పీజీఆర్‌ఆర్‌సీడీఈ ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.నరేశ్‌రెడ్డి, ఓఎస్‌డీ ప్రొఫెసర్ ఎస్.జితేంద్రకుమార్ నాయక్ విద్యాసంస్థల్లో ఎస్‌డీజీఎస్ అమలు ప్రాముఖ్యతను వివరించారు. ఐక్యూఏసీ డైరెక్టర్ ప్రొఫెసర్ శిరీష, కో-ఆర్డినేటర్ డాక్టర్ హరీష్ గుప్తా ఎస్‌డీజీఎస్‌తో పరిశోధనలను అనుసంధానించే ప్రక్రియపై అవగాహన కల్పించారు. సమావేశంలో 300 మంది అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఓఎస్‌డీ జితేందర్ కుమార్ నాయక్

సమగ్ర ప్రగతి దిశగా ఓయూ అడుగులు

● ప్రిన్సిపాల్స్, డీన్స్, డైరెక్టర్లతో వీసీ సమావేశం

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా విశ్వవిద్యాలయం సమగ్ర ప్రగతి ప్రణాళిక రూపొందించేందుకు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం ప్రిన్సిపాల్స్, డీన్స్, డైరెక్టర్స్, విభాగాధిపతులతో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ వచ్చే ఏడాదిలో ఎన్ఐఆర్ఎఫ్, ఎన్ఏఏసీ, క్యూఎస్ వరల్డ్ ర్యాంకింగ్స్‌లో మెరుగైన స్థానం సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని పిలుపునిచ్చారు. వ్యక్తుల గొప్పతనం కంటే ఉస్మానియా ప్రతిష్ఠ ముఖ్యమని గుర్తుంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.నరేష్ రెడ్డి, ఓఎస్‌డీ ప్రొఫెసర్ జితేంద్ర కుమార్ నాయక్, యూజీసీ డీన్ ప్రొఫెసర్ లావణ్యతో కలిసి విశ్వవిద్యాలయ ప్రగతిపై ప్రత్యేక బ్రోచర్‌ను ఆవిష్కరించారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఓయూ వీసీ, అధికారులు

● శుభాకాంక్షలు



మంత్రి అజారుద్దీన్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొల్లు కిషన్, చిత్రంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తదితరులు

- నల్లకుంట, ఆంధ్రజ్యోతి

'ఏఐ ఎడ్యుకేషన్'పై జాతీయ సదస్సు 15న

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా విశ్వవిద్యాలయం మైనారిటీస్ సెల్ ఆధ్వర్యంలో ఈనెల 15న జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని 'ట్రాన్స్‌ఫార్మింగ్ ఎడ్యుకేషన్ అండ్ స్కిల్స్ ఇన్ ద ఈఆర్ఏ ఆఫ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్" అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. సదస్సు పోస్టర్‌ను వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం, రిజిస్ట్రార్ జి.నరేష్ రెడ్డి, ఓఎస్‌డీ ఎస్.జితేంద్ర కుమార్ నాయక్ మంగళవారం విడుదల చేశారు. భారత తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలను స్మరించుకునేందుకు ఈ సదస్సు ఏర్పాటు చేస్తున్నట్టు మైనారిటీస్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ హమీదా బీ తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యుగంలో విద్యా వ్యవస్థ రూపాంతరం, నైపుణ్యాభివృద్ధి, మానవ విలువలు వంటి అంశాలపై చర్చలు జరుగుతాయని పేర్కొన్నారు.

పెళ్లి కావడం లేదని
రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పెళ్లి కావడం లేదని మనస్తాపంతో ఓ వ్యక్తి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ నారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ ఆత్మకూర్ ప్రాంతానికి చెందిన సురేందర్ కుమారుడు నరేష్(30) అమీర్‌పేట్‌లో హాస్టల్ ఉంటూ స్థానికంగాగల దుస్తుల దుకాణంలో పనిచేస్తున్నాడు. పెళ్లి కావడం లేదన్న మనస్తాపంతో మంగళవారం బీబీనగర్‌లో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న సికింద్రాబాద్ రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు



ఢిల్లీలో బాంబు పేలుళ్ల మృతులకు నివాళి

ఢిల్లీలో బాంబు పేలుళ్లలో మృతి చెందిన వారికి బాగ్‌అంబర్‌పేటలో శ్రీగురువాయూరు అయ్యప్ప స్వామి దేవాలయం వద్ద అయ్యప్ప స్వాములు కొవ్వొత్తులతో మంగళవారం నివాళులర్పించారు. కార్యక్రమంలో గురుస్వాములు జనగామ ఓంకార్, శేఖర్‌రెడ్డి, మల్లంపేట సత్యనారాయణ, వర్కాల కృష్ణ, ఎం.మహేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

- నల్లకుంట, ఆంధ్రజ్యోతి



భవానీ శంకర ఆలయంలో కార్తీక దీపాలను వెలిగించి పూజలు చేసిన ఆలయ కమిటీ చైర్మన్ మేడి సురేష్‌కుమార్, సీఐ రాంబాబు

భవానీ శంకర ఆలయంలో ప్రత్యేక పూజలు

ముషీరాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకొని భోలక్‌పూర్ దేవునితోటలో గల భవానీ శంకర ఆలయంలో సామూహిక కార్తీక దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. ముషీరాబాద్ సీఐ రాంబాబు, ఆలయ కమిటీ చైర్మన్ మేడి సురేష్ కుమార్ కార్తీక దీపాలను వెలిగించి స్వామివారికి అర్చనలు, అభిషేకాలు చేశారు. మేడి సురేష్‌కుమార్ మాట్లాడుతూ ఈ నెల 20 వరకు స్వామివారికి ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక పూజలు, సామూహిక దీపారాధన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ధర్మకర్త రాజు, ఆలయ సిబ్బంది సురేష్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.



కొమర్రాజు దుర్గాప్రసాద్‌ను సన్మానించిన ఆంజనేయస్వామి ఆలయ చైర్మన్ జానకి సుధాకర్, ఈవో దేవనాథం

శ్రోతలను రంజింపచేసిన భక్తిగీతాల విభావరి

చిక్కడపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాస ఉత్సవాల సందర్భంగా చిక్కడపల్లి వివేక్‌నగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ కల్చరల్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన భక్తిగీతాల విభావరి శ్రోతలను రంజింపచేసింది. ఘంటసాల భక్తిగీతామృతం పేరిట స్వరసామ్రాట్ డా. టి. శరత్‌చంద్ర సంగీత సారథ్యంలో ఆయనతోపాటు ఆదినారాయణ తదితరులు గీతాలను ఆలపించారు. ఈ సందర్భంగా సుందరకాండ పుస్తక రచయిత కొమర్రాజు దుర్గాప్రసాద్‌ను ఆలయ చైర్మన్ జానకి సుధాకర్, ఈవో మాచర్ల దేవనాథం సన్మానించారు.

ఘనంగా ఘంటసాల గానామృతం

చిక్కడపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సృష్టి ఆర్ట్స్, చంద్రతేజాలయ సమర్పణలో మంగళవారం రాత్రి త్యాగరాయగానసభలో నిర్వహించిన ఘంటసాల గానామృతం కార్యక్రమం ఘనంగా జరిగింది. గాయనీగాయకులు ఘంటసాల పాటలను పాడి ప్రేక్షకులను అలరించారు. సృష్టి ఆర్ట్స్ అధినేత, ప్రముఖ గాయకుడు హరికృష్ణ మాట్లాడుతూ ఘంటసాల పాటలను బ్రతికించడమే తన లక్ష్యమన్నారు. గాయనీగాయకులను ఆయన సత్కరించారు.